# స్మృతి

టి. వి. లో అందమైన అమ్మాయి వార్తలు చదువుతోంది. సెంటర్‌లో పిల్లలందరూ శ్రద్ధగా వింటున్నారు. కొందరయితే వార్తల్లోని ముఖ్యాంశాలు చిన్నగా నోట్ చేసుకుంటున్నారు. అది గ్రామసేవికల కోసం తరిఫీదిచ్చే వుచిత శిక్షణా కేంద్రం. అక్కడ చేరిన ఆడపిల్లలందరూ సాంఘికంగా వెనుకబడి, ఇప్పుడిప్పుడే పది క్లాసుల వరకు చదువు పూర్తిచేసుకుని—ఇక్కడ పొందిన శిక్షణతో గ్రామాల్లో తరతరాలుగా నిరక్షరాస్యతకి, దారిద్ర్యానికి బలైపోతున్న వారికి జీవితంలో ఆశని, వెలుగుని చూపించటానికి నిర్దేశింపబడినవారు. ఈ పథకంలో కొంత నిరుద్యోగ నిర్మూలన వున్నట్లే సాంఘిక సేవ కూడా వుంది—

సమత తీక్షణంగా టి. వి. లోకి చూస్తోంది. బంగ్లాదేశ్‌లో ఉప్పెన. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. కొన్ని దీవులైతే పూర్తిగా కొట్టుకొని పోయాయట. చనిపోయినవారి సంఖ్య ఖచ్చితంగా చెప్పలేకుండా వున్నారు. వార్తలు చెప్పే అమ్మాయి కంఠం ఆగింది—దృశ్యం. భయంకరమైన దృశ్యం–, ఎక్కడ పడితే అక్కడ శవాలు – పిల్లలు, పాపలు, స్త్రీలు, ముసలివాళ్ళు, గేదెలు, ఆవులు, కోళ్ళు పందులు – ఒకటేమిటి ? అదొక శవాలు తేలుతున్న చెరువు. అక్కడొక ప్రాణి, ఇక్కడొక మనిషి – దీనంగా, వేదనగా, భయంగా ఏడుస్తూ, దిక్కులు చూస్తూ, పిచ్చిగా అరుస్తూ వికృతంగా వున్నారు.

సమత వున్నట్లుండి ' అమ్మో ! ' అంటూ అరిచింది. అంతలోనే పెద్దగా ఏడ్వడం మొదలుపెట్టింది - అందరూ ఒకేసారి సమతవైపు చూశారు. ఆమె ఘొల్లున ఏడుస్తోంది - టి. వి. లో దృశ్యం మారింది. తోటి పిల్లలు సమత చుట్టూ చేరి ఏమిటి ఏమిటని అడుగుతున్నారు. సమతేం మాట్లాడ లేకుండా వుంది. అంతలో వార్డెన్ పరుగెట్టుకొచ్చి,

" అమ్మాయిలూ ! మీరంతా దూరంగా జరగండి. ఆమెకి కాస్త గాలి తగలనివ్వండి " అంటూ సమత దగ్గిరగా చేరిందామె. తలపై నెమ్మదిగా నిమిరింది___

" అమ్మా ! అమ్మా ! నాన్నా ! నాన్నా___తాతయ్యా ! " అంటూ పిచ్చిచూపులు చూస్తోంది సమత___

వార్డెన్‌కి అయోమయంలోంచి కొంత అర్థమైంది-, పిల్లల్ని వెళ్ళిపొమ్మని సమతని జాగ్రత్తగా పొదివి పట్టుకుంది___

*

ఆలిండియా రేడియో తుఫాను హెచ్చరిక ప్రతి అరగంటకీ వినిపిస్తూనే వుంది. విన్నవాళ్ళు వింటున్నారు, వినని వాళ్ళు వినటంలేదు. పట్టించుకునేవారు అమ్మో అనుకుంటున్నారు - కొందరయితే ఎప్పుడూ ఈ రేడియోకి పనిలేదు. ఏదో ఒకటి చెప్తూనే వుంటుందని తీసి పారేస్తున్నారు___

ఉదయం తొమ్మిది గంటలకి ఆకాశం చిల్లుపడిందన్నట్లు వర్షం కురుస్తోంది. క్షణం క్షణం గాలి వేగం పెరుగుతోంది. సూర్యుడుదయించని ఆ రోజు పగలే చీకట్లు చిక్కబడుతున్నాయి.

అదో చిన్న - అతి చిన్న పల్లెటూరు. ఆ వూళ్లో వంద ఇళ్ళయినా వుంటాయో లేదో. అక్కడవున్న బడుగు ప్రజల జీవితాల్లు

అప్పటికే పూర్తిగా బయటపడిపోయాయి. కప్పిన తాటాకులన్నీ గాలికి ఎగిరిపోయి, ఇళ్ళు, వాకిళ్ళు తడిసిపోయి, అప్పుడప్రాణప్రైన సత్తుగిన్నెలు గాలికి దడదడ ఎగిరిపోతున్నాయి. పెద్దవాళ్ళ మనసుల్లో గుబులు పేరుకుంటోంది. అదేమీ అర్థంకాని చిన్నపిల్లలు కేరింతలు కొడుతున్నారు. అటూ యిటూ కాని వయస్సులోని పిల్లలకీ భయంగానూ వుంది - సాయంత్రానికి వర్షం, గాలి తగ్గిపోతాయని ధైర్యంగానూ వుంది.

రెండు తాటాకులు అడ్డపెట్టి తల్లి అన్నం ఉడకేస్తుంటే ముత్యాలు ఆ తాటాకులు ఎగిరిపోకుండా పట్టుకుంది. మండీ మండని పొయ్యిమీంచి దింపిన ఉడికీ ఉడకని అన్నం తిన్నామనిపించుకుని లేచారంతా-తాతయ్య తడుస్తున్నా చలికి వణకడంలేదు. పైగా "ఏరా సాంబడూ. ఇంత వానలో కూడా ఏడిగానే వుందిరా" అంటుంటే ముత్యాలు కుండ అడుగున మిగిలిన మూడు మెతుకుల్ని కూడా వూడ్చేసుకుని తినేసింది-,

తిండి బాధ తీరినా నిలిచేందుకు నీడలేదు - ఒకటే వర్షం—నిలబడ లేని గాలి, మనుషుల్ని ఎగరగొట్టేస్తోంది. తడిసిన బట్టలు గాలికి చిలిగి చిరిగిపోతున్నాయి.

ఆ ఊరుకున్న ఒకే ఒక సిమెంటు కట్టడం చర్చి. "సాంబడూ ! లెగండి - లెగవే సత్తి - ముత్తూ నడండే ఆ సెర్చిలోనే కూకుందాం" అంటూ కదిలాడు తాత. తమకున్న బట్టెడు ఆస్తిని తలమీద పెట్టుకుని సత్తి నడుస్తుంటే తల్లిని అనుసరించింది ముత్యాలు — వాళ్ళకి టైమెంతో తెలియదు. తెలిసే అవకాశంలేదు. అప్పుడు వస్తున్న ఒక్కొక్క— గాలి వూపుకి దట్టంగా కట్టిన సిమెంటు కట్టడం కూడా పడిపోతుందేమోననే భయం కలుగుతోంది —

సమయం గడిచేకొద్దీ సముద్రంమీద ఎంతో అనుభవం వున్న తాత కూడా భయం భయంగా దిక్కులు చూస్తున్నాడు.

" ఏంటిరా యిది ? యిట్టాంటి గాలివోన నే సూసిన పైనంలేదు " అంటున్నాడు వుండి వుండి -

పిల్లలకి, అది రాత్రో, పగలో తెలీదుగానీ తలో చోట పడి నిద్రపోయారు. అయిదు గంటలయేసరికి వూళ్ళో జనం చర్చిలో కూడుకున్నారు. పైశాచికంగా వీస్తున్న గాలి చేసే భయంకర ధ్వనులకి అందరూ గుండె లవిసిపోయి నిశ్శబ్దంగా కూర్చున్నారు. కొందరు వారి వారి మనసులలో వాళ్ళ వాళ్ళ దేవుళ్ళని తలుచుకుంటున్నారు. కొందరు తామున్నది చర్చి కదా అని ఆ క్షణానికి ఏసుప్రభు రక్షిస్తే బాగుండునని కూడా అనుకుంటున్నారు.

ఆ తుపానులో మెరుపులు లేవు. వురుములు లేవు. అంతకంటె భయంకరమైన దయ్యపు గాలి రొద.

ముత్యాలు కళ్ళల్లోకి నిద్ర కూరుకొస్తుంటే - దూరంగా కాళ్ళు, చేతులు బిగించి కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్న తల్లి కనిపించింది - నిద్రకి వొరిగింది ముత్యాలు. వేడిగా బలంగా వున్న నీటికెరటం ఎత్తి ఎక్కడికో విసిరేస్తుంటే ముత్యాలుకి మెలకువ వచ్చింది - భయంతో అరిచేందుకు కూడా గొంతు పెగలని ఆమె ఒక తాటిమొవ్వులో చిక్కుకుంది.

భయంతో వణికిపోతూ చుట్టూ చూసేసరికి ఎప్పుడూ చూడని భీభత్స దృశ్యం - అంతా జలమయం - మంచాలు, కర్రలు - దూలాలు, వెదుళ్ళు, ఎక్కడా మనుష్యులు జాడ లేదు. శవాలు తప్ప.

ముత్యాలు భయంతో బావురుమని స్పృహ కోల్పోయింది. వారం రోజుల తర్వాత శరణార్థుల శిబిరంలో చేసిన వైద్య సహాయంతో ఆమె కళ్ళు తెరిచింది. నిశితంగా పరిశీలిస్తే ఆమెకేమీ గుర్తున్నట్లుగా అనిపించ లేదు - అక్కడ డాక్టర్లు నర్సులు ఆమె కేవో గుర్తుచెయ్యడానికి

ప్రయత్నించలేదు కూడా. పూర్తిగా ఊడ్చిపెట్టినట్టు కొట్టుకుపోయిన ఆ పల్లెలో అత్యంతాశ్చర్యంగా తాటిచెట్టు మొవ్వులో ఇరుక్కుని స్పృహ కోల్పోయి, అసలు గాయాలేమీ తగలకుండా దొరికింది పన్నెండేళ్ళ పిల్ల.

ప్రపంచాన్ని ఒక ఊపు ఊపింది, ఆంధ్రప్రదేశ్‌లో 1977 నవంబరు 19 న దివిసీమలో వచ్చిన ఉప్పెన. గ్రామానికి గ్రామాలు అంతుచిక్కకుండా పోయాయి. దొరికిన వారెవరో దొరకారు. ఎవరెందుకు ఎవరు పోయారో తెలుసుకోవడమే గగనమైంది. శవాన్ని పోగులు చెయ్యడం ఒక సమస్య. వాటిని ఖననం చెయ్యడం మరొక పెద్ద సమస్య అయిపోయాయి - ఊరికి పది పదిహేనుమంది మిగిలితే వారి గురించి ప్రభుత్వం మంచి చర్యలు తీసుకున్నా - అవిసిపోయినవారి గుండెల్లో భయాన్ని ఎవ్వరూ తీసివేయలేకపోయారు. ఎన్నో సంఘాలు - ఎన్నో సమితులు సేవాధర్మంతో వస్తే - కొందరు స్వార్థంతో శవాలమీద డబ్బుని సొమ్ముచేసుకుందామని ఎగబడినవారూ లేకపోలేదు. చింకిపాతగాడి కోసం కరుణతో కేటాయించిన దాంట్లోంచి కొట్టేసేది కొట్టేసి, కోట్లు గడించినవారూ లేకపోలేదు. విదేశాలనుండి వచ్చిన సహాయాన్ని నేర్పుగా తస్కరించి నిర్భాగ్యుల్ని నిర్భాగ్యులుగానే వుంచేసిన పెద్దమనుషులూ లేకపోలేదు.

పదిహేను రోజులు గడిచాయి - ఎప్పుడూ కృష్ణమ్మ పోయి సముద్రుణ్ని కలిస్తే, ఇప్పుడు సముద్రుడు తానే కదిలివచ్చి కృష్ణమ్మని కౌగలించుకున్నాడు.

పొలాలనిండా ఉప్పు-నూతులూ, కాల్వలు అన్నీ ఉప్పుమయాలు.

ఆరోజు పట్నంనుంచి విజయలక్ష్మిగారు వస్తున్నందుకు అక్కడ చిన్న సభ ఏర్పాటుచేశారు. ఆమె పట్నంలో గొప్ప పారిశ్రామికవేత్త భార్య. లెక్కలకి అందనంత డబ్బుగల ఆమె చేతిలో ఎన్నో మహిళా సమాజాలున్నాయి. అనాధశరణాలయాలున్నాయి. స్త్రీ జన సంరక్షణ కేంద్రాలున్నాయి—

ఆమెకి ముత్యాలు గురించి, ఆమె ఎంత ఆశ్చర్యంగా మృత్యు ముఖంనుండి బయటపడిందో అక్కడివారు చెప్పగా ఆమె చెమ్మగిల్లిన కళ్ళతో వింది. ఆరోజు ఆమె ఆ చిన్నారిని తను దత్తత తీసుకుంటానని ఆమె బాగోగులు చూసుకుంటానని అందరిలోనూ వాగ్దానం చేసింది. అందరూ ఆమె గొప్ప హృదయానికీ, జాలి గుండెకీ పేదలయందు ఆమెకి గల కరుణకి ఆమె నెంతో పొగిడారు. అభినందించారు. ఆరోజు - ఆమె కార్లో ముత్యాలు పట్నం చేరింది. మూడంతస్తుల ఆ మేడలో అడుగుపెట్టాక ఆమెలో కొంచెం చైతన్యమొచ్చింది. తన నీడ తనకి కనిపించేంత నున్నటి గచ్చు - అందమైన పువ్వులున్న తోట, మెత్తని గడ్డి - అక్కడున్నవి ఎప్పుడూ ముత్యాలు చూడలేదు.

నాలుగు రోజులు గడిచేసరికి ఒక్కొక్క పని అందుకుని గ్రహించుకుని, చేసేయడం మొదలుపెట్టింది. ఆ పిల్ల - విజయలక్ష్మి ముత్యాల్ని ఎప్పుడూ ఏమి అనేదికాదు. కడుపునిండా తిండి - కంటినిండా నిద్ర - ఒళ్ళు అలసిపోయేంత పని-, ముత్యాలు జీవితం సాఫీగా సాగిపోతోంది. రెండు నెలలు తిరిగేసరికి ముత్యాలు చెయ్యి తిరిగిన పనిమనిషిగా స్థిరపడింది. ఆ ఇంట అమ్మగారు ఏ పని చెప్పినా వుషారుగా పరుగెట్టికెళ్ళి చేసేది—

అతిథు లెవరొచ్చినా వారి దృష్టి ముత్యాలుమీద పడుతుందంటే కారణం ఆమె పనితనం-, పాత విషయాలు గుర్తులేకపోయినా ప్రస్తుత విషయాలు చక్కగా గ్రహించి తదనుగుణంగా వ్యవహరించేది ముత్యాలు. ఆరోజు కాఫీ ట్రేలో పట్టుకొచ్చి టేబులుమీద పెట్టింది ముత్యాలు. అమ్మగారి స్నేహితురాలెవరో ఒకామె ఒకటే గలగల మాట్లాడేస్తూ ఒక్కసారి ముత్యాలువంక చూసి "ఎవరీ పిల్ల ముత్యంలా వుంది" అంది.

విజయలక్ష్మి ఆశ్చర్యంగా " భలే చెప్పావు ఆ పిల్ల పేరు కూడా ముత్యాలు. ఎంతయినా రచయిత్రి ననిపించుకున్నావు " అంది పొగడ్తగా.

" అలాగే - ఎవరి పిల్లా ? "

" మొన్న దివిసీమ ఉప్పెనలో-ఎంత చిత్రమనుకున్నావు. ఊరు ఊరంతా కొట్టుకుపోయింది. ఈ పిల్ల మాత్రం ఓ చెట్టు పైన ఆశ్చర్యంగా కూర్చుని వుండిపోయిందిట. అఫ్‌కోర్సు ! స్పృహ లేదనుకో. మొన్న నేనొక సర్వేకోసం వెళ్ళాను. అక్కడ వాళ్ళు చెప్పారు. పోనీ మన దగ్గర వుంటుంది. పనోళ్ళు దొరక్క చస్తున్నాం - వుంటుంది అని తీసుకొచ్చేశా " అంది.

" మంచిపని చేశారు. నాక్కూడా ఎవరైనా వుంటే చూద్దురూ, పుణ్యముంటుంది " అందామె వయ్యారంగా పమిట సర్దుకుంటూ—

"చూద్దాంలెండి ఏం ? ఈ రోజుల్లో తిండీ గుడ్డా దొరకడం మాత్రం ఎంత కష్టం " అంది విజయలక్ష్మి.

" అవునవును. మనం లేనిపోని కష్టాలు కూడా పెట్టం, కొట్టం. ఏదో మనం చెప్పిన పనిచేసి—ఇంటిపట్టున పడివుంటే అంతే చాలు—" అంది రచయిత్రిగా పేరు సంపాదించాలనే తీవ్రకాంక్ష బాధితురాలైన ఆమె.

" పనివాళ్ళతో మహా బాధగా వుంది. వాళ్ళకెన్ని షోకులని— షికార్లు, సినిమాలు రిబ్బన్లు—ఫేషన్లు. అందుకే ఆలోచించాను—"

" మరింక చెప్పకండి. మీ బుర్ర అద్భుతం—"

" మీ రెప్పుడూ నన్ను పొగుడుతారు. మీ అభిమానం అలాంటిది-"

ఈ మాటలు విన్న ముత్యాలుకి మరోలా ఏమీ అనిపించలేదు. బుర్రలో ఒక పక్క పక్షవాతానికి పడిపోయినట్లు ప్రస్తుత విషయాలెంత బాగా అర్థంచేసుకున్నా - మరింకేమీ చలనంలేదు. ఆమె చెప్పిన కథను కథగానే విని వదిలేసింది—

విజయలక్ష్మి ముద్దుల కొడుకు సుధీర్, కూతురు సుమిత్ర. సాధారణంగా డబ్బు ఎంత ఎక్కువగా వుంటే పిల్లలకి అంత సాంద్రతలో గారం జరుగుతుందన్న విషయం సత్యం.

ఆరోజు ఇద్దరూ స్కూలునుంచి వస్తూనే కాస్త కొట్టాడుకుంటూనే వచ్చారు. పోను పోను అది చిలికి చిలికి గాలివానైంది. ఇద్దరూ కొట్టుకోబోతే ముత్యాలు వాళ్ళని విడదీసి, లాలించి, పాలు త్రాగించి ఇద్దరిని ట్యూషన్ పేడం వచ్చేవేళకి సిద్ధంచేసి తనూ అక్కడ కూర్చుని వాళ్ళ పుస్తకాలు తిరగేస్తూ బొమ్మలు చూస్తోంది – అదేదో కొత్త ప్రపంచంలా వుంది ముత్యాలుకి. తనూ అలా పుస్తకాలు చూస్తూ, బొమ్మల చదువు చదువుకోవాలని అనిపిస్తోంది. ఇంతవరకు ముత్యాలు పిల్లల చదువుల దగ్గరకీ, పుస్తకాల దగ్గరకీ రాలేదు. ఆరోజు విజయలక్ష్మి యింట్లో లేకపోవడంవల్ల అక్కడ కూర్చుంది.

సుశీలా టీచర్ వచ్చింది. ఆమె పాఠం చెప్పటం మొదలుపెట్టింది. సుధీర్, సుమిత్ర నిశ్శబ్దంగా యుద్ధం చేసుకుంటూనే వున్నారు. గిల్లుకుంటూ – రక్కుకుంటూ – వెక్కిరించుకుంటూ పాఠం వినడంలేదు. ముత్యాలు మాత్రం రెప్పవేయకుండా టీచరు ముఖంలోకి చూస్తూ, ఆమె పెదవులెలా కదులుతున్నాయో గమనిస్తూ ఆమె చెప్పే మాటలకి నాగుపాములా నిశ్చలంగా వుండిపోయింది. అలాగే వింటోంది.

నిజానికి ముత్యాలుకి టీచర్ చెప్పిందేమీ అర్థంకాలేదనే చెప్పాలి. సుశీలా టీచర్ పిల్లలవంక విసుగ్గా చూసి తనకీ పాఠం చెప్పాలనిపించక ముత్యాలుతో మాటల్లో పడింది. ఆమె ద్వారా మెల్లగా విషయాలన్నీ రాబట్టి ఆశ్చర్యపోయింది. ముత్యాలు పూర్తిగా ఉప్పెన గురించి చెప్పలేకపోయినా – ఆమె చెప్పిన నాలుగు మాటలబట్టి, విషయం గ్రహించింది. ఆమె మనస్సు తగ్గున మండిపోయింది – మనిషి మాటకి,

చేతకి ఎంత లేదా! - విజయలక్ష్మి ఆ పిల్లని ఉద్ధరించటానికి తెచ్చినట్లు అంతా అనుకుంటారు కానీ, ఆమె కుసంస్కారంతో ఆ పిల్లని తనింట జీతం బత్తెంలేని దాసిగా వుంచుకుందని ఎవరికి తెలుస్తుంది ?

సుశీల యింటికి వెళ్తూ తీవ్రంగా ఆలోచించి, ఒక మారు పేరుతో వివరాలన్నీ యిస్తూ ముత్యాలు దీనమైన పరిస్థితిని వివరిస్తూ - ఉప్పెనకు సంబంధించిన స్పెషల్ ఆఫీసరుకి ఒక లేఖ రాసి పడేసింది.

అది రాసిన వారం రోజులకి విజయలక్ష్మి యింటికి ఎంతో మర్యాదగా వచ్చి ముత్యాలు వివరాలు తెలుసుకుని ఆమెకి చదువు సంధ్యా ఏమీ జరగడంలేదని, కేవలం పనిపిల్లగా వాడుకోబడుతోందని తెలిసి - తక్షణం ఆమె నక్కడినుండి తీసుకెళ్ళిపోయారు. ముందుగా కొంచెం కూడా గ్రహించలేకపోవడంవల్ల ప్రమాదాన్ని ఎదుర్కోలేకపోయింది విజయలక్ష్మి. పూర్తిగా కప్పుకోడానికి ఆమె భర్త కూడా ఆమెకు సహకరించకపోవటంతో మరి నోరెత్తలేకపోయింది. ఆయన ఉన్నంతలో పెద్దమనిషి అవటంవల్ల, అనాధ పిల్లని తీసుకొచ్చి చదువు చెప్పించాలి గానీ, పనిపిల్లగా వాడుకోడం తప్పని, పనిపిల్ల కావాలంటే ఆ మాటమీదే సంపాదించుకోవాలనీ ఆయన భార్యని వ్యతిరేకించటం వలన విజయలక్ష్మి నోరు మెదపలేకపోయింది. అయోమయావస్థలో ముత్యాలు శరణాలయం చేరడం చదువు మొదలుపెట్టడం జరిగింది.

ఆ రోజుతో ముత్యాలు సమతగా మారింది. ఆమెలో అజ్ఞాతంగా దాగివున్న విద్యాకాంక్ష పెల్లుబికింది.

అయిదారేళ్ళలో ఆమెలో ఎవ్వరూ ఊహించని మార్పు వచ్చింది.

1977 నవంబరు 19 దివిసీమను ఊడ్చిపెట్టిన తుఫానులో - తల్లిని, తండ్రిని, తాతయ్యని, బంధువుల్ని కోల్పోయిన అన్నెం పున్నెం ఎరుగని ముత్యాలుకి-ఇప్పుడు హుందాగా చురుకుగా తీర్చిదిద్దిన బొమ్మలా తయారైన సమతకి పోలికే లేదు.

అయితే—

తవ్వకాల్లో బయటపడిన భయంకర పురాతన కంకాళాలు ఇన్నేళ్ళ తర్వాత ఆమె మెదడులో అడుగు కూరుకుపోయిన జ్ఞాపకాలై ఒక్కసారి బయటపడ్డాయి. బంగ్లాదేశ్‌లో ఉప్పెన దృశ్యంలో ఆమె మానసికంగా తీవ్ర సంక్షోభానికి గురైంది.

ఎన్ని ప్రపచారాలు చేసినా ఆమె విపరీతంగా ఏడ్వడం ఆపటంలేదు. డాక్టరు, సమతకి పూర్తిగా నిద్రపోయేలా మందులిచ్చి పడుకోబెట్టారు. మూడు రోజులు ఒళ్ళు తెలియకుండా నిద్రపోయి లేచాక, ఆమెకి నెమ్మదిగా ఒక్కొక్కటి జ్ఞాపకం రావడం మొదలుపెట్టాయి. ఎనిమిదేళ్ళ క్రితం జరిగిన దుర్ఘటన ఆమెకి నిన్న మొన్నటి దానిలా గుర్తుకొచ్చింది.

ఆరోజు తను నిద్రపోయే ముందు చూసిన తల్లి ముఖం, "లెగండి, లెగండి" అంటూ కంగారుపెట్టిన తాతయ్య ముఖం అలా అలా చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. జరిగినవన్నీ ఎవరూ దాచకుండా చెప్తూ వచ్చారు. క్రమంగా ఆమె అవన్నీ విని అవగాహన చేసుకునే నిబ్బరాన్ని పొందింది.

అయితే—

ఇన్నేళ్ళ తర్వాతామె తనవాళ్ళకోసం తనివితీరా ఏడ్చింది.